హనుమాన్ శోభాయాత్రకు భారీ బందోబస్తు

● చిక్కడపల్లి ఏసీపీ రమేష్‌కుమార్



ఇంటర్వ్యూ

చిక్కడపల్లి, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): హనుమాన్ శోభాయాత్రకు భారీ బందోబస్తు ఏర్పాటు చేపట్టినట్లు చిక్కడపల్లి పోలీస్ సబ్ డివిజన్ ఏసీపీ ఎల్. రమేష్‌కుమార్ తెలిపారు. సబ్‌డివిజన్ పరిధిలోని చిక్కడపల్లి, ముషీరాబాద్ పీఎస్‌ల పరిధిలోని 2.5 కిలోమీటర్ల పరిధిలో శనివారం హనుమాన్ శోభాయాత్ర కొనసాగుతుందని ఈ సందర్భంగా ర్యాలీ సాఫీగా సాగిపోయేలా, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఆయన వివరించారు. ఈ సందర్భంగా ఏసీపీ రమేష్‌కుమార్‌తో ఇంటర్వ్యూ

ప్రశ్న: హనుమాన్ శోభాయాత్ర ఎక్కడి నుంచి వెళ్తుంది?

ఏసీపీ: హనుమాన్ శోభాయత్ర సబ్‌డివిజన్ పరిధిలోని చిక్కడపల్లి బ్రిడ్జి నుంచి ప్రారంభమై ఆర్టీసీ క్రాస్‌రోడ్ మీదుగా ఎడమవైపు తిరిగి జవహర్‌నగర్, అశోక్‌నగర్ చౌరస్తామీదుగా అరుంధతీనగర్, సబర్మతీనగర్, గాంధినగర్ టిజంక్షన్ మీదుగా సికింద్రాబాద్‌కు వెళ్తుంది.

ప్రశ్న: బందోబస్తు వివరాలు చెప్పండి?

ఏసీపీ: మూడు రోజులుగా ర్యాలీ వెళ్లే ప్రాంతంలో ఎలాంటి రాళ్లు, రప్పలు, మట్టికుప్పలు లేకుండా లారీలలో ఎత్తివేయించాం. ర్యాలీ వెళ్లే ప్రాంతంలో అవాంఛనీయ సంఘటనలు జరిగే అవకాశం లేకుండా చర్యలు తీసుకున్నాం. ర్యాలీ సాఫీగా వెళ్లేందుకు పీస్ కమిటీ, బస్తీలు, కాలనీల పెద్దలతో మాట్లాడాము. సబ్‌డివిజన్ పరిధిలోని ర్యాలీ సాగే ప్రాంతాల్లో డీఎస్పీ అంతకంటే పై క్యాడర్ అధికారులు, ఇన్‌స్పెక్టర్, ఎస్‌ఐలతోపాటు అదనపు బలగాలు మొత్తంగా 300 మంది సిబ్బంది కాకుండా ఆర్ఎఎఫ్ (రాపిడ్ యాక్షన్‌ఫోర్స్), ఆక్టోపస్ సిబ్బంది, ఇప్పటికే ఉన్న కెమెరాలకు తోడుగా మరిన్ని కెమెరాల ద్వారా అంటే ప్రతి 100 మీటర్లకు ర్యాలీ సాగే తీరు, కదలికలు అనుక్షణం పరిశీలించే ఏర్పాట్లు చేశాము.

ప్రశ్న: ఆర్టీసీ క్రాస్‌రోడ్ నుంచి ర్యాలీ వెళ్లే సమయంలో ఎలాంటి చర్యలు చేపట్టారు?

ఏసీపీ: ర్యాలీ ఆర్టీసీ క్రాస్‌రోడ్‌కు చేరుకునే ముందుగానే మిగతా మూడు రోడ్లు మూసివేస్తాము. ర్యాలీ క్రాస్‌రోడ్ దాటి అశోక్‌నగర్ వైపు వెళ్లిపోయిన తర్వాతే మిగతా మూడు రోడ్లు ఓపెన్ చేయడం జరుగుతుంది. క్రాస్‌రోడ్‌లో సాధ్యమైనంతమేరకు ర్యాలీ వడివడిగా వెళ్లేవిధంగా కృషి చేస్తాము.

ప్రశ్న:ర్యాలీ సందర్భంగా చేసే సూచనలు ఏమిటి?

ఏసీపీ: ర్యాలీ సందర్భంగా ఎలాంటి సంఘటనలు చోటుచేసుకోకుండా ర్యాలీలో వెళ్లేవారు సహకరించాలి. ఎక్కడా కూడా ఆలస్యం లేకుండా ముందుకు సాగితే అందరికి మంచిది.

ప్రశ్న: ర్యాలీ సాగే ప్రాంతాల్లో రక్షణ ఎలా ఉంటుంది?

ఏసీపీ: ర్యాలీ సాగే ప్రాంతాల్లో పూర్తిస్థాయిలో రక్షణ ఉంటుంది. అనుక్షణం డేగకళ్లతో పరిశీలిస్తాం. చిన్న సమస్య వచ్చినా అక్కడికక్కడే పరిష్కరించి క్షణాల్లో ర్యాలీ సాఫీగా సాగేలా ఏర్పాట్లు జరిగాయి. ఎవరూ కూడా ఎలాంటి భయాందోళనలకు గురికావాల్సిన అవసరం లేదు.



అంబర్‌పేట చౌరస్తాలో మహాత్మాజ్యోతిరావు పూలే విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్



అడిక్‌మెట్‌లో పూలే విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్, ముఠా జైసింహ, తదితరులు



ఇందిరాపార్కు చౌరస్తాలో పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న బీజేపీ రాజ్యసభ సభ్యుడు డాక్టర్ లక్ష్మణ్, మాజీ ఎమ్మెల్యే చింతల రాంచంద్రారెడ్డి

ఆదర్శనీయుడు జ్యోతిరావు పూలే

జోన్‌బృందం, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): సామాజిక న్యాయం కోసం బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం కృషి చేసిన గొప్ప నాయకుడు మహాత్మాజ్యోతిరావు పూలే. శుక్రవారం ముషీరాబాద్, అంబర్‌పేట నియోజకవర్గాల్లో మహాత్మాజ్యోతిరావు పూలే జయంతిని ఘనంగా నిర్వహించారు. పలువురు వక్తలు ఆయన సేవలను కొనియాడారు. వేడుకల్లో కాంగ్రెస్ పార్టీ రాజ్యసభ సభ్యుడు అనిల్ కుమార్‌యాదవ్, బీజేపీ రాజ్యసభ సభ్యుడు డాక్టర్ కె. లక్ష్మణ్, అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్, పలువురు రాజకీయ నాయకులు హాజరై పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించి ఆయన సేవలను కొనియాడారు.



బాగ్‌లింగంపల్లిలో పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న రాంనగర్ కార్పొరేటర్ రవిచారి తదితరులు



ఇందిరాపార్కు చౌరస్తాలో పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ రాజ్యసభ సభ్యుడు అనిల్‌కుమార్ యాదవ్, బి బ్లాక్ అధ్యక్షుడు కృష్ణ, డివిజన్ అధ్యక్షుడు భాస్కర్



టీడీపీ నగర కార్యాలయంలో మహాత్మాజ్యోతిరావు పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న ఆ పార్టీ నగర అధ్యక్షుడు సాయిబాబా తదితరులు



గోల్నాకలో పూలే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు ఆనంద్‌గౌడ్



పూలే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న గాంధీనగర్ కార్పొరేటర్ పావనీవినయ్‌కుమార్



గాంధీనగర్‌లో పూలే విగ్రహానికి నివాళులర్పిస్తున్న బీఆర్ఎస్ సీనియర్ నేత ఎమ్మెన్ శ్రీనివాసరావు



అశోక్‌నగర్‌లో పూలే చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న అభిషేక్ కెన్నడీ, కాంగ్రెస్ నేతలు



అంబర్‌పేటలో పూలే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న అంబర్‌పేట డివిజన్ కార్పొరేటర్ విజయకుమార్‌గౌడ్



అంబర్‌పేటలో పూలే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మాజీ కార్పొరేటర్ వనం రమేష్, బీజేపీ నాయకులు



పూలే జయంతిని పురస్కరించుకుని అంబర్‌పేటలో బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న కేవీపీఎస్ నాయకులు



అడిక్‌మెట్‌లో నివాళులర్పించిన బీజేపీ డివిజన్ అధ్యక్షుడు సాయికృష్ణయాదవ్, శేషసాయి

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

చిక్కడపల్లి, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): ఆజామాబాద్ డివిజన్ పరిధిలో శనివారం విద్యుత్ సరఫరా ఉండదని ఏడీఈ నాగేశ్వరరావు తెలిపారు. డీడీహెచ్ 11 కేవీ విద్యుత్ ఫీడర్ పరిధిలోని నాగమయ్యకుంట, కట్టమైసమ్మ టెంపుల్, చుట్టుప్రక్కల ప్రాంతాల్లో ఉదయం 10.30 నుంచి 11 గంటల వరకు సరఫరా ఉండదన్నారు.

బంగారం వ్యాపారాలపై పర్యవేక్షణ ఉండాలి

చిక్కడపల్లి, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా బంగారు ఆభరణాలపై హాల్‌మార్కింగ్‌తో పాటు ప్రతి ఆభరణంపై తప్పనిసరిగా హెచ్‌యూఐడీ నంబర్ ఉండాలని కేంద్ర వినియోగదారుల మంత్రిత్వశాఖ గతంలో ఆదేశాలు జారీ చేసిందని. తూనికలు కొలతల శాఖ బంగారం వ్యాపారాలపై పర్యవేక్షణ ఉండాలని వినియోగదారుల మండలి జాతీయ ప్రధాన కార్యదర్శి సాంబరాజు చక్రపాణి, సీపీఐ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు మొగిలిచర్ల సుదర్శన్, సభ్యులు చిలువేరు ప్రవీణ్, నల్లా రాజేందర్ విజ్ఞప్తి చేశారు. బంగారు ఆభరణాల వ్యాపారులు వినియోగదారులకు ఆభరణాలు అమ్మకం చేసే సమయంలో రశీదులపై తప్పనిసరిగా నాణ్యతకు సంబంధించిన క్యారెట్‌లు, వాటి నంబర్‌ల వివరాలు ఉండేలా చర్యలు తీసుకోవాలని తద్వారా వినియోగదారులకు ఎలాంటి అన్యాయం జరగకుండా చూడాలని కోరారు.

బీజేపీతోనే దేశం అభివృద్ధి: కార్పొరేటర్

ముషీరాబాద్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): ప్రధాని నరేంద్రమోదీ సారథ్యంలో బీజేపీ పాలనలో దేశం అన్నివిధాల అభివృద్ధి చెందుతున్నదని ముషీరాబాద్ కార్పొరేటర్ సుప్రియా నవీన్ గౌడ్ అన్నారు. శుక్రవారం ముషీరాబాద్ డివిజన్‌లోని వైఎస్ఆర్ పార్కు వీధిలో బీజేపీ నాయకులు వెంకటేష్, చారి, వేణుల సంయుక్త ఆధ్వర్యంలో బీజేపీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సుప్రియా నవీన్ గౌడ్ మాట్లాడుతూ నాలుగేళ్లలో ప్రధాని నరేంద్రమోదీ స్ఫూర్తితో ముషీరాబాద్‌లో అనేక అభివృద్ధి పనులు పూర్తి చేశామని అన్నారు. రాబోయే జీహెచ్ఎంసీ ఎన్నికల్లో బీజేపీ గెలుపే లక్ష్యంగా పనిచేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ ముషీరాబాద్ నియోజకవర్గం జాయింట్ కన్వీనర్ నవీన్‌గౌడ్, ముషీరాబాద్ డివిజన్ బీజేపీ అధ్యక్షుడు కంచి ముదిరాజ్, డివిజన్ మాజీ అధ్యక్షుడు బద్రినారాయణ, పార్టీ సీనియర్ నాయకులు మెట్టు వాసు, వెంకటేష్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



● డీఎంసీకి అవార్డు

ఇచ్చిన టార్గెట్ కంటే ఎక్కువ ఆస్తి పన్ను వసూలు చేసినందుకు గానూ అంబర్‌పేట సర్కిల్ డీఎంసీ మారుతీదివాకర్‌కు జీహెచ్ఎంసీ కమిషనర్ ఇలంబరిది శుక్రవారం కమిషనర్ కార్యాలయంలో బెస్ట్ ప్రాపర్టీ ట్యాక్స్ కలెక్షన్ అవార్డు అందజేశారు.

- రాంనగర్, ఆంధ్రజ్యోతి

ఐక్యంగా ఉన్నప్పుడే శాంతి నెలకొంటుంది

● సెంట్రల్ జోన్ డీసీపీ శిల్పావల్లి

ముషీరాబాద్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): ఐక్యంగా ఉన్నప్పుడే శాంతి నెలకొంటుందని సెంట్రల్ జోన్ డీసీపీ శిల్పావల్లి అన్నారు. శుక్రవారం ముషీరాబాద్‌లోని కషీష్ ఫంక్షన్‌హాల్‌లో చిక్కడపల్లి జోన్ పీస్ కమిటీ ఆధ్వర్యంలో హనుమాన్ జయంతి శోభాయాత్రను పురస్కరించుకొని సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన డీసీపీ శిల్పావల్లి మాట్లాడుతూ ఇరువర్గాల ప్రజలు ఐక్యంగా పండగలను జరుపుకుంటూ మతసామరస్యాన్ని కాపాడాలని అన్నారు. కలిసికట్టుగా శాంతియుత వాతావరణంలో పండుగలు జరుపుకుంటూ మన పిల్లలకు, సమాజానికి మంచి సందేశాన్ని అందించాలని సూచించారు. పండుగల సందర్భంగా నిర్వహించే ర్యాలీలు ప్రజల్లో ఆధ్యాత్మిక భావన పెంపొందించేలా ఉండాలని అన్నారు. ముషీరాబాద్‌లో గతంలో జరిగిన ఘటనలు పునరావృత్తం కాకుండా శాంతియుతంగా శోభాయాత్ర ర్యాలీలు నిర్వహించాలని సూచించారు. నగర పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు శోభాయాత్రలలో డీజే సౌండ్‌కు అనుమతి లేదని పేర్కొన్నారు. డీజే సౌండ్ వల్ల పిల్లలు, గర్భిణీలు, గుండె జబ్బువారు ఇబ్బందులు ఎదుర్కోవడంతోపాటు శబ్ద కాలుష్యం ఏర్పడుతుందని అందువల్లే డీజేలకు అనుమతి ఇవ్వడం లేదని పేర్కొన్నారు. ఉత్సవ నిర్వాహకులు పోలీసులకు సహకరించాలని కోరారు. ఈ సందర్భంగా పీస్ కమిటీ నాయకులు తమ అభిప్రాయాలను వెల్లడించారు. ఈ సమావేశంలో చిక్కడపల్లి ఏసీపీ రమేష్ కుమార్, సీఐ రాంబాబు, డీఐ, ఎస్సైలు, పీస్ కమిటీ నేతలు నవీన్ గౌడ్, నల్లవెల్లి అంజిరెడ్డి, మహ్మద్‌అలీ, జహంగీర్, ఖదీర్, అక్తర్, శంకర్‌గౌడ్, నవీన్, దీక్షిత్‌రెడ్డి పాల్గొన్నారు.



ముషీరాబాద్‌లో జరిగిన చిక్కడపల్లి పీస్ కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న సెంట్రల్ జోన్ డీసీపీ శిల్పావల్లి

జీహెచ్ఎంసీ ఎన్నికల్లో బీజేపీని గెలిపించాలి

● డాక్టర్ గౌతమ్‌రావు

బర్కత్‌పుర, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): జీహెచ్ఎంసీ, స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీని గెలిపించాలని ఆ పార్టీ ఎమ్మెల్సీ అభ్యర్థి డాక్టర్ ఎన్.గౌతమ్‌రావు పిలుపునిచ్చారు. ఎంఐఎంను ఓడించడమే లక్ష్యంగా బీజేపీ బరిలోకి దిగిందని, కార్పొరేటర్లు ఆదరించి ఓటు వేయాలని కోరారు. శుక్రవారం కాచిగూడ కార్పొరేటర్ కన్నె ఉమాదేవిని కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా శాలువతో సత్కరించారు. బీజేపీని గెలిపిస్తేనే కేంద్రం నుంచి జీహెచ్ఎంసీకి నిధులు తెప్పించడంలో అంకితభావంతో పనిచేస్తామన్నారు.

గిరిజన, లంబాడీలకు మంత్రి పదవి ఇవ్వాలి

● పడిత్యా శంకర్‌నాయక్

నల్లకుంట, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్రంలో త్వరలో జరిగే మంత్రివర్గ విస్తరణలో గిరిజన, లంబాడీ సామాజిక వర్గం నుంచి ఒకరికి మంత్రిపదవి ఇవ్వాలని గిరిజన ప్రజా సమాఖ్య, గిరిజన విద్యార్థి సమాఖ్య నేతలు కాంగ్రెస్ పార్టీ అధిష్టానాన్ని, సీఎం రేవంత్‌రెడ్డిలకు విజ్ఞప్తి చేశారు. శుక్రవారం హైదర్‌గూడలోని ఎన్ఎస్ఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో గిరిజన ప్రజా సమాఖ్య జాతీయ అధ్యక్షుడు పడిత్యా శంకర్‌నాయక్ మాట్లాడారు. రాష్ట్రంలో త్వరలో జరిగే నియోజకవర్గాల పునర్విభజనలో గిరిజన జనాభాను రాష్ట్ర యూనిట్ ప్రతిపత్తి కాకుండా జిల్లాల ప్రాతిపదికన విభజించి ఎమ్మెల్యేలు, ఎంపీలుగా అవకాశం కల్పించాలన్నారు. రాష్ట్రంలో కొనసాగుతున్న ఎస్సీ, ఎస్టీ కమిషన్‌ను వేర్వేరుగా విభజించి గిరిజనుల కోసం స్వయం ప్రతిపత్తితో కూడిన ఎస్టీ కమిషన్‌ను ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు హరిలాల్ నాయక్, దినేష్‌నాయక్, రాము నాయక్, మునినాయక్, స్వామినాయక్ పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలి

రాంనగర్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): నాల్గవ తరగతి ఉద్యోగులకు రావాల్సిన పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలని తెలంగాణ నాల్గవ తరగతి ఉద్యోగుల కేంద్ర సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.గంగాధర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగిన సంఘం రాష్ట్ర సమావేశంలో ఆయన మాట్లాడారు. నాల్గవ తరగతి ఉద్యోగులకు రావాల్సిన రిటైర్డ్‌మెంట్ బెనిఫిట్స్, డీఏలు విడుదల చేయాలన్నారు. ఇందు కోసం ప్రభుత్వం బడ్జెట్ పెంచాలన్నారు. నాల్గవ తరగతి ఉద్యోగుల సమస్యల పరిష్కారమే ధ్యేయంగా తమ సంఘం పనిచేస్తుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సానుకూలంగా స్పందించాలని కోరారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు జి.జ్ఞానేశ్వర్, అసిస్టెంట్ అధ్యక్షుడు దాస్య నాయక్, కోశాధికారి ధన్‌రాజ్, నాయకులు సాదిక్ పాషా, చంద్రయ్య, సురేష్, వీరన్న సింగ్ నాయకులు, సభ్యులు పాల్గొన్నారు.

నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

● అఖిల భారత ఐక్య రైతు సంఘం

నల్లకుంట, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): అకాల వడగండ్ల వానతో నష్టపోయిన రైతాంగాన్ని పిడుగుపాటుతో మృతి చెందిన కుటుంబాన్ని ఆదుకోవాలని అఖిల భారత ఐక్య రైతు సంఘం (ఏఐయూకేఎస్) రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు రంగారెడ్డి, ప్రభాకర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం విద్యానగర్‌లోని మార్క్స్ భవన్‌లో జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. ఉమ్మడి కరీంనగర్, మెదక్, నల్గొండ, నిజామాబాద్ జిల్లాల్లో కురిసిన వర్షాలకు వరి, మామిడి తోటలు తీవ్రంగా నష్టపోయాయని తెలిపారు. పంట నష్టపోయిన ప్రతి రైతుకు ఎకరాకు 50 వేలు, పిడుగుపాటుతో మరణించిన కుటుంబానికి 10 లక్షల నష్టపరిహారం ఇవ్వాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.



ఎంపీ ఆర్.కృష్ణయ్యకు జ్యోతిరావు పూలే ఎక్స్‌లెన్సీ అవార్డు ప్రదానం చేస్తున్న తెలంగాణ మేధావుల ఫోరం అధ్యక్షుడు డాక్టర్ రాజ్‌నారాయణముదిరాజ్

ఎంపీ ఆర్.కృష్ణయ్యకు జ్యోతిరావు పూలే ఎక్స్‌లెన్సీ అవార్డు

రాంనగర్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): బీసీలకు రాజ్యాధికారం తీసుకురావడం కోసం తన తుదిశ్వాస ఆగే వరకు పోరాటం చేస్తానని రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్య తెలిపారు. జ్యోతిరావు పూలే జయంతిని పురస్కరించుకుని తెలంగాణ మేధావుల ఫోరం ఆధ్వర్యంలో శుక్రవారం సాయంత్రం విద్యానగర్‌లోని బీసీ భవన్‌లో జరిగిన కార్యక్రమంలో ఆర్.కృష్ణయ్యకు జ్యోతిరావు పూలే ఎక్స్‌లెన్సీ అవార్డు ప్రదానం చేశారు. ఫోరం అధ్యక్షుడు డాక్టర్ రాజ్‌నారాయణ ముదిరాజ్ అధ్యక్షతన అవార్డు ప్రదానంతోపాటు లక్ష రూపాయల నగదు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 40 సంవత్సరాలుగా బీసీల డిమాండ్ల సాధన కోసం తాను చేసిన ఉద్యమాలు, పోరాటాలు గుర్తించి తెలంగాణ మేధావుల ఫోరం జ్యోతిరావు పూలే ఎక్స్‌లెన్సీ అవార్డు ఇవ్వడం గర్వంగా ఉందన్నారు. తాను చేసిన ఉద్యమాలను ప్రభుత్వాలు గుర్తించకున్నప్పటికీ తెలంగాణ సమాజం, మేధావులు గుర్తించడంతో తన జన్మసార్థకమైందన్నారు. ఈ అవార్డు భావితరాలకు స్ఫూర్తిగా నిలుస్తుందన్నారు. బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు గుజ్జ సత్యం మాట్లాడుతూ ఆర్.కృష్ణయ్య పోరాటాలకు ఇతర దేశాలు నోబెల్ బహుమతి ఇచ్చేవని, భారత ప్రభుత్వం భారతరత్న అవార్డు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో బీసీ సంఘాల నేతలు గుజ్జకృష్ణ, నీల వెంకటేష్, సుధాకర్, రాజు నేత, రాజేందర్, మణికంఠ, రామకృష్ణ, ఫోరం నాయకులు బండారి దయానంద్ యాదవ్, సులోచనరాణి, రామకృష్ణశాస్త్రి తదితరులు పాల్గొన్నారు.

27న డ్యాన్స్‌ఫెస్ట్-2025

● 20వ తేదీలోపు ఆసక్తి గల కళాకారులకు ఆహ్వానం

నల్లకుంట, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ నృత్య దినోత్సవం పురస్కరించుకుని స్ఫూర్తి మ్యూజిక్ డ్యాన్స్ అకాడమి ఆధ్వర్యంలో కూచిపూడి, భరతనాట్యం, కథక్, పేరిణి, జానపద, సినిమా వెస్ట్రన్స్ డాన్స్ కళాకారుల నృత్య ప్రతిభను ప్రోత్సహించడానికి డ్యాన్స్‌ఫెస్ట్-2025 కార్యక్రమం ఈనెల 27వ తేదీన నిర్వహించనున్నట్లు ఆ సంస్థ డైరెక్టర్ ఇ.సూర్యతేజ సుబ్రాంత్ మాస్టర్ తెలిపారు. శుక్రవారం హైదర్‌గూడలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈ డ్యాన్స్ ఫెస్ట్‌లో 6 నుంచి 60 సంవత్సరాల వయసు గల ఏ నాట్య కళాకారులైన పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించడానికి వేదిక కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ డ్యాన్స్‌ఫెస్ట్‌లో నాట్య ప్రదర్శనలోని కళాకారులకు నటరాజు మెమోంటో, సర్టిఫికెట్, గోల్డ్ మెడల్స్ ప్రదానం చేయనున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా నాట్యగురువులకు నాట్య గురురత్న పురస్కార ప్రదానం, పిల్లలను ప్రోత్సహిస్తున్న తల్లిదండ్రులకు సన్మానం జరుగుతుందన్నారు. ఈ డ్యాన్స్‌ఫెస్ట్-2025లో ఆసక్తి గల వారు ఈ నెల 20వ తేదీలోపు సంప్రదించాలని, ఇతర వివరాలకు 9652347207 ఫోన్ నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

హనుమాన్ జయంతికి ఆలయాల ముస్తాబు



హనుమాన్ జయంతి వేడుకలకు ముస్తాబైన పద్మశాలి కాలనీలోని సంజీవ ఆంజనేయస్వామి దేవాలయం



హనుమాన్ జయంతి శోభాయాత్ర బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న అభయ ఆంజనేయస్వామి సేవా సమితి నేతలు



మహాత్మానగర్‌లో అభయ ఆంజనేయస్వామి దేవాలయాన్ని ముస్తాబు చేస్తున్న ఆయన కమిటీ అధ్యక్షుడు బిజ్జి కనకేష్ కుమార్

● శోభాయాత్రను విజయవంతం చేయాలి

● అభయ ఆంజనేయస్వామి సేవా సమితి

ముషీరాబాద్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): హనుమాన్ జయంతిని పురస్కరించుకొని శనివారం ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు రాంనగర్ అడిక్‌మెట్‌లోని హనుమాన్ దేవాలయం నుంచి హనుమాన్ జయంతి శోభాయాత్ర ర్యాలీని నిర్వహించనున్నట్లు అభయ ఆంజనేయస్వామి సేవా సమితి నేతలు తెలిపారు. ర్యాలీ రాంనగర్ చౌరస్తామీదుగా చేపల మార్కెట్, దాయారం మార్కెట్ మీదుగా బాకారం బొమ్మల గుడివరకు భక్తి శ్రద్ధలతో శాంతియుతంగా భారీ ర్యాలీ నిర్వహిస్తున్నామని సేవా సమితి నేతలు తెలిపారు. రాజకీయాలకతీతంగా నిర్వహించే శోభాయాత్ర ర్యాలీలో వివిధ పార్టీల నేతలు, దేవాతామూర్తుల ప్రతిమల ప్రదర్శనతో వైభవంగా నిర్వహిస్తామని తెలిపారు. భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని శోభాయాత్రను విజయంతం చేయాలన్నారు.

ఆలయాల ముస్తాబు...

హనుమాన్ జయంతిని పురస్కరించుకొని మహాత్మానగర్‌లో ప్రసిద్ధిగాంచిన అభయ ఆంజనేయస్వామి దేవాలయాన్ని రంగురంగుల విద్యుత్ దీపాలతో ఆలయ కమిటీ అధ్యక్షుడు బిజ్జి కనకేష్ కుమార్,ఆలయ కమిటీ నిర్వాహకులు ముస్తాబు చేశారు. పద్మశాలి కాలనీలో ప్రసిద్ధి గాంచిన సంజీవ ఆంజనేయ స్వామి ఆలయాన్ని రంగులు వేసి అలంకరించారు. జంనేయస్వామి విగ్రహానికి ఊరేగింపుకు సర్వాంగ సుందరంగా ముస్తాబు చేసినట్టు ఆలయ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు సీతామార్కండయ, పుండరీకం, సీనియర్ నాయకులు నవీన్, ఆర్ ఆంజనేయులు, వెంకటేష్, కృష్ణమూర్తి తెలిపారు.



లోయర్ ట్యాంక్‌బండ్ సాయిబాబా దేవాలయంలో పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఆలయ చైర్మన్ మందలపు గాంధీ, నిర్వాహకులు ధనుంజయ్, తదితరులు

రేపు ఎన్టీఆర్ స్టేడియంలో షిర్డీ సాయిబాబా లక్ష్మీ మహాయజ్ఞం

కవాడిగూడ, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): నగరంలోని ఎన్టీఆర్ స్టేడియంలో ఈనెల 13న జరగనున్న శ్రీ షిర్డీ సాయి లక్ష్మీ మహాయజ్ఞం-2025లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని లోయర్ ట్యాంక్ బండ్ శ్రీ షిర్డీ సాయిబాబా దేవాలయ మేనేజింగ్ ట్రస్టీ, చైర్మన్ మందలపు గాంధీ, తెలంగాణ రాష్ట్ర షిర్డీ సాయి మందిరాల భక్త ఐక్యవేదిక చైర్మన్ ధనుంజయ్, సాయిశ్రీనివాస్, హనుమంత్‌లు కోరారు. శుక్రవారం లోయర్ ట్యాంక్‌బండ్‌లో కార్యక్రమ పోస్టర్‌ను వారు ఆవిష్కరించారు. సమావేశంలో సాయిబాబా భక్తులు పద్మ తదితరులు పాల్గొన్నారు.